క్లుప్తంగా

సచివాలయ సిబ్బంది 'ముఖాముఖి'



ఏఎస్సార్ నగరవాసులతో మాట్లాడుతున్న సచివాలయ సెక్రటరీ దేవి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం స్థానికులతో సచివాలయ సిబ్బంది ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. దీని ద్వారా స్థానికుల సమస్యలు సచివాలయ సిబ్బంది నేరుగా తెలుసుకుని, పరిష్కార మార్గాలు చూపించడం సులభమవుతుందని డీబీఆర్సీ ప్రతినిధులు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చాలా బాగుందని కాలనీవాసులు కితాబిచ్చారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీలు గ్రేస్, దేవి, డీబీఆర్సీ ఫీల్డ్ కో ఆర్డినేటర్ నిఖిలా, కసపర్తి రాజు, వలంటీర్లు రాధిక, ధనలక్ష్మి, కాలనీ నాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వరప్రసాద్‌కు ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డు



కంచరపాలెం: మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సోషియల్ పాయింట్ ఫౌండేషన్ సంస్థ ప్రతిష్టాత్మకమైన ప్రైడ్ ఆఫ్ ఇండియా జాతీయ అవార్డును నగరానికి చెందిన చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా కన్వీనర్, సామాజిక కార్యకర్త మాముడూరి వరప్రసాద్ అందుకున్నారు. సంస్థ చైర్మన్ అభిషేక్ దెంబ్ల, ఫౌండర్ అమిత్ ప్రజాపతి చేతులు మీదుగా అవార్డు అందుకున్నట్లు వరప్రసాద్ తెలిపారు. దీంతో వరప్రసాద్‌కు హ్యూమన్ రైట్స్ సభ్యులు అభినందనలు తెలిపారు.

గరీబ్ నవాజ్ ఉత్సవాల్లో బర్కత్ అలీ



చాదర్‌ను తీసుకెళ్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ

మద్రిపాలెం: దేశంలోనే ప్రతిష్టాత్మకంగా నిర్వహించే దర్గా ఉత్సవాల్లో 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ పాల్గొన్నారు. అజ్మీర్‌లో జరిగే ఉత్సవాల్లో అజ్మీర్ ఖ్వాజా గరీబ్ నవాజ్ దర్గా ఉత్సవాల విశిష్టత వర్ణించలేనిదని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఈ దర్గాలో మొక్కు చెల్లించడానికి వెళ్లిన కమిటీ సభ్యుల్లో తాను ఒకరిగా హాజరై చాదర్ సమర్పించినట్లు బర్కత్ అలీ చెప్పారు.

ఘనంగా మహాకుంభాభిషేకం



అలంకరణలో యోగసిద్ధాంజనేయుడు

మురళీనగర్: సూర్యానగర్ జాతీయ రహదారిని ఆనుకుని వెలసిన యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా శనివారం మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నిత్యార్చన, పూర్ణాహుతి అనంతరం ఆలయ శిఖరానికి 108 కలశాలతో మహాకుంభాభిషేకం చేశారు. యోగసిద్ధాంజనేయ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకుడు ఆరవిల్లి శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిపారు. సాయంత్రం నిర్వహించిన సంగీత కచేరి ఆహుతులను అలరించింది.

ఆధ్యాత్మికం

భక్తిశ్రద్ధలతో రథసప్తమి



సీతంపేట: సూర్యభగవానుడిని పూజించే రథసప్తమి వేడుకలు ఉత్తర నియోజకవర్గంలో శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో పూజలు, హోమాలు, సూర్యనమస్కారాలు చేశారు. ఇళ్లల్లో మహిళలు ఆవు పిడకలపై పాలు పొంగించి పరమాన్నం తయారు చేసి చిక్కుడాకులపై సూర్య భగవానుడికి నివేదించారు.

లలితా పీఠంలో..

లలితానగర్ లలితా పీఠంలో రథసప్తమి సందర్భంగా త్రిచ మహాసౌర అరుణ పారాయణ సహిత సూర్యనమస్కారాలు, మహా సౌర హోమం నిర్వహించారు. రంగు రంగుల ముగ్గులు, పువ్వులతో వేద పండితులు అరుణ యంత్రం వేసి పూజలు చేసి మహా సౌర పారాయణం జరిపారు. అనంతరం వేద పండితులు సూర్యనమస్కారాలు చేశారు. కుర్తాళం, లలితాపీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అరుణ యంత్రానికి హారతి ఇచ్చి పూజలు ప్రారంభించారు. పీఠం ఆస్థాన వేద పండితులు మాచవోలు రమేష్‌శర్మ నేతృత్వంలో శాస్త్రోక్తంగా పూజలు జరిగాయి. శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని, పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

లలితా పీఠంలో అరుణ యంత్రానికి పూజలు చేస్తున్న వేద పండితులు

సూర్యనారాయణుడికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణస్వామి



ఆలయ అధ్యక్షుడు మూర్తికి వెండి కవచం అందిస్తున్న భక్తులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లోని శ్రీసూర్యనారాయణ, సీతారామలక్ష్మణ హనుమంతు సహిత శివపార్వతి సమేత శ్రీ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో రథసప్తమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు యేడిద గురునాథ్‌శర్మ ఆధ్వర్యంలో శనివారం ఉదయం నుంచి సూర్యనారాయణమూర్తికి క్షీరాభిషేకం, పూజలు, అభిషేకాలు జరిపారు. స్వామివారి కోసం వెండి కవచాన్ని ఆలయ అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తికి భక్తులు అందజేశారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ భక్తులు బహూకరించిన వెండి కవచాన్ని సూర్యనారాయణుడికి అలంకరించినట్లు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ నెల 29న ఉదయం 7 గంటల నుంచి అభిషేకాలు, సూర్యనమస్కారాలు, 30న కృత్తిక నక్షత్రం సందర్భంగా ఉదయం 10 గంటలకు సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు చేస్తారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాదేటి సత్యనారాయణ, ఎం.ఎస్.ప్రకాశరావు, దామేటి భీమన్న, జి.కృష్ణ, శంకరనాయుడు, మూర్తి మాస్టార్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవ వేంకటేశ్వరుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నమో సూర్య భగవాన్



సూర్యభగవానుడికి పూజలు చేస్తున్న అర్చకుడు

కంచరపాలెం: స్థానిక తిక్కవానిపాలెం అన్నపూర్ణ విశ్వేశ్వర సూర్యభగవాన్ ఆలయంలో శనివారం రథసప్తమి పురస్కరించుకుని ప్రధాన అర్చకుడు ఏలూరు రామకృష్ణశర్మ సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించారు. ఆలయ ఆవరణలో భక్తులు సూర్యరథాన్ని పూలతో అలంకరించి ప్రసాదాలు సమర్పించారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, ఆలయ చైర్మన్ గంటా కామరాజు, ఆలయ కమిటీ సభ్యులు పట్టిమి రాజు, కొనాడ రాము ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కలియుగ వెంకన్నకు పంచామృతాభిషేకాలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్నకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించారు.

సూర్యనమస్కారాలతో సంపూర్ణ శక్తి

- డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి



రైల్ క్లబ్‌లో యోగాసనం వేస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి, అధికారులు, సిబ్బంది

తాటిచెట్లపాలెం: సూర్యనమస్కారాల ద్వారా సూర్యుడిలో ఉండే శక్తిని స్వీకరించగలమని డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి అన్నారు. రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్ క్లబ్‌లో ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ఆధ్వర్యంలో శనివారం రథసప్తమి సందర్భంగా ఏర్పాటు చేసిన సూర్యనమస్కారాల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. 108 సార్లు సూర్య నమస్కారాలు చేయడం సులువైన పనికానప్పటికీ దీనిని అవలంబించడం వల్ల క్రమశిక్షణ, స్వావలంబన, మరింత పదునైన మనసు లభిస్తుందన్నారు. కార్యక్రమ నిర్వాహకురాలు, ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి మాట్లాడుతూ మకర సంక్రాంతి రోజున ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించామని, 15 రోజుల యోగాసనాలు–సూర్యనమస్కారాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. రైల్వే ఉద్యోగుల్లో ఆరోగ్యంపై శ్రద్ధ కల్పించడం, దైనందిన జీవితంలో యోగా ప్రాముఖ్యాన్ని తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. రథసప్తమి ద్వారా రుతువుల్లో మార్పులు జరుగుతాయని, శీతాకాలం ముగిసి పంట(కోత) కాలం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమయంలో సూర్యుడిలోని అధిక శక్తి మానవ శరీరం తీసుకుంటుందని, దీని ద్వారా మానవ శరీరం మంచి శక్తితో నిండి ఎటువంటి వ్యాధులతోనైనా పోరాటం చేసేలా మారుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), సుధీర్‌కుమార్ గుప్తా(ఇన్‌ఫ్రా), ఈకార్వో వైస్ ప్రెసిడెంట్స్ కవితా గుప్తా, మధుస్మిత సాహూ, ఈకార్వో సభ్యులు, రైల్వే అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు



అవ్వను ఆప్యాయంగా పలకరిస్తున్న కె.కె.రాజు

మద్రిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 50వ వార్డులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వుడా కాలనీ–2 293 సచివాలయం పరిధి మాధవధార, తెన్నేటీనగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి ఆయన పర్యటించారు. ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ చిన్నారుల దగ్గర నుంచి వృద్ధుల వరకు నవరత్నాల ద్వారా చక్కటి సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని కొనియాడారు. ప్రజలకు సేవ చేయాలనే నిజాయితీ, నిబద్ధత, పట్టుదల, కష్టపడే మనస్తత్వం అందరూ ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో ముఖ్యమంత్రికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ 50వ వార్డు అధ్యక్షురాలు సునీత, డైరెక్టర్లు నూకరాజు, రాయుడు శ్రీను, ప్రసూనరెడ్డి, ఐ.రవికుమార్, వార్డు నాయకులు భగాతి విజయ్, కృష్ణారావు మాస్టర్, ఎంలక్ష్మీ, పాతపట్నం రామ్మోహన్, నారాయణ స్వామి, ఎం.వి.సోనీ, చిరంజీవి, త్రినాథ్, నారాయణరావు, రాంబాబు, పూజారి రాము, సీపాన రాము, శివాజీ, జగదీష్, సీనియర్ నాయకులు షేక్ బాబ్జి, కె.చిన్నా, రాఘవులు, గురువోజీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పెరుగుతున్న ఆర్థిక అసమానతలు



మాట్లాడుతున్న ఆర్థిక శాస్త్ర ఆచార్యుడు వంశీ

సీతంపేట: గత మూడు నాలుగు దశాబ్దాలుగా ఆర్థిక అసమానత, ఆర్థిక అస్థిరత, మానవ–ప్రకృతి పరస్పర చర్యలు పెరిగాయని ఆర్థిక శాస్త్ర ఆచార్యుడు వకులాభరణం వంశీ అన్నారు. మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'మార్క్స్ పెట్టుబడి గ్రంథం సమకాలీన ప్రాసంగికత' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఈ సమస్యలకు శాశ్వతమైన పరిష్కారం కోసం పెట్టుబడిదారీ వ్యతిరేక రాజకీయ ఎజెండా తప్పనిసరని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉత్పత్తి సాధనాల యజమానులు కార్మికుల అదనపు విలువలను కాజేస్తున్నారని విమర్శించారు. వ్యక్తిగత సంపద అసమానత స్థాయిల్లో చిన్నదైన కానీ గుర్తించదగిన పెరుగుదలతోపాటు వాస్తవంగా అన్ని సమూహాల్లో దేశంలో సంపదల స్థాయిలు పెరిగాయన్నారు. కార్ల్‌మార్క్స్ రాసిన గ్రంథం చదవడం ద్వారా అనేక అంశాలను అవగతం చేసుకునేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్.అంజయ్య, మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం నిర్వాహకుడు జె.వి.సత్యనారాయణమూర్తి, విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడు సిహెచ్.రాఘవేంద్రరావు, సీపీఐ కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ కార్యాలయంలో ఆధునిక లిఫ్ట్ ప్రారంభం



లిఫ్ట్‌ను ప్రారంభిస్తున్న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

సీతమ్మధార: ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆధునిక లిఫ్ట్‌ను సీఎండీ కె.సంతోషరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిఫ్ట్ ఏర్పాటుతో దాదాపు 250 మంది ఉద్యోగులకు, సుమారు 600 మంది పింఛన్‌దారులకు, సర్కిల్ కార్యాలయానికి వచ్చిన వందలాది వినియోగదారులకు చాలా సౌలభ్యంగా ఉంటుందన్నారు. లిఫ్ట్‌ను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోని తీసుకొచ్చిన విశాఖ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్‌ను సీఎండీ అభినందించారు. లిఫ్ట్‌ను ఉపయోగించి పనితీరును పరిశీలించారు. సుమారు రూ.28 లక్షలతో లిఫ్ట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉద్యోగులు, పింఛన్ వ్యవహారాల కోసం పదవీ విరమణ చేసిన ఉద్యోగులు అవస్థలు పడేవారని, వీరి సౌలభ్యం కోసం పది మందిని ఒకే సారి తీసుకుని వెళ్లగలిగే ఆధుని లిఫ్ట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ బి.రమేష్‌ప్రసాద్, ప్రాజెక్టు డైరెక్టర్ డా.ఎ.వి.వి.సూర్యప్రతాప్, ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం, అనసూరి రాధిక, చీఫ్ జనరల్ మేనేజర్ వి.విజయలలిత, జోన్–1 కార్యనిర్వాహక ఇంజినీర్ జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

48వ వార్డులో విద్యుత్ సమస్యల పరిష్కారం

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు బాపూజీనగర్, రామకృష్ణనగర్, నీలకంఠనగర్, శివలింగపురం, పల్నాటీ కాలనీ, శ్రీనివాస్‌నగర్ కొండవాలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కారమయ్యాయి. ఈ ప్రాంతాల్లో తుప్పుపట్టిన ఇనుప స్తంభాల చోట సిమెంటు స్తంభాలను, వెలగని విద్యుత్ లైట్లు ఉన్న చోట కొత్తవి ఏపీఈపీడీఎల్ కంచరపాలెం జోన్–2 అధికారులు ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు ఆదేశాల మేరకు జీవీఎంసీ విద్యుత్ దీపాల అధికారులు, వార్డు నాయకుడు గంకల అప్పారావు నేతృత్వంలో శనివారం వార్డులో ఈ చర్యలు చేపట్టారు. విద్యుత్ సమస్యలు పరిష్కారమవడంతో ఏపీఈపీడీసీఎల్ అధికారులకు, కార్పొరేటర్ కవితకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

సీతమ్మధార: నగరంలోని ఒక హోటల్‌లో పేకాటాడుతున్న పలువురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని పోర్ట్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం కొందరులు పేకాట ఆడుతున్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. వారి వద్ద నుంచి రూ.లక్షా 90 వేల తోపాటు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

అధ్వానంగా ప్రధాన మార్గాలు



ధర్మానగర్‌లో అధ్వానంగా పరిసరాలు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం కూడలి నుంచి తాటిచెట్లపాలెం వీపీపీ రోడ్డు మార్గాలు అధ్వానంగా మారాయి. శిథిలావస్థలో డ్రైనేజీలు ఉండటంతో మురుగు సక్రమంగా ప్రవహించకుండా నిలిచిపోతోంది. ఆ మురుగులో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. కంచరపాలెం బీఆర్‌టీఎస్ నుంచి ధర్మానగర్, తిక్కవానిపాలెం ప్రాంతాలకు సమీపంలో రైల్వే రక్షణ గోడకు ఆనుకుని 24/7 తాగునీటి పైపులు నిరుపయోగంగా వదిలేయడంతో సమస్య తలెత్తుతోందని పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. రైల్వేకు చెందిన రహదారి కావడంతో జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ సిబ్బంది ఇక్కడి పారిశుధ్యాన్ని సరిగా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారిలో అడ్డంగా వదిలేసిన పైపుల వద్ద భారీ వాహనాలు నెలలు తరబడి బారులు తీరుతున్నాయి. సంబంధిత అధికారులు పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రేపటి నుంచి కుష్టువ్యాధిపై అవగాహన

మహారాణిపేట: మహాత్మా గాంధీ 75వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 30 నుంచి వచ్చే నెల 13 వరకు కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా లెప్రసీ అండ్ టీబీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పాఠశాల, కాలేజీ విద్యార్థులు పాల్గొని కుష్టువ్యాధి నివారణకు కృషి చేయాలన్నారు.

కరాటే పోటీల పోస్టర్ల ఆవిష్కరణ



పోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సినీ నటుడు సుమన్ తదితరులు

మురళీనగర్: ఆల్ ఇండియా వాడొక్కై కరాటే డో అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్‌లో విశాఖపట్నంలో నిర్వహించనున్న అంతర్జాతీయ కరాటే పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు మురళీనగర్‌లోని హేమ అబోడ్స్‌లో పోటీల లోగో, పోస్టర్లను ఇండియా వాడొక్కై కరాటే అధ్యక్షుడు, సినీ నటుడు సుమన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు, జనసేన నాయకుడు బొడ్డేపల్లి రఘు, బీజేపీ గాజువాక అధ్యక్షుడు కె.నరసింగరావు, బొత్సా సురేష్, అంగా రాము, చీఫ్ ఆర్గనైజర్ సిహెచ్.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, సామాజిక భవనాలకు శంకుస్థాపన



వంశీనగర్‌లో శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు

మద్రిపాలెం: జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న 50వ వార్డు వంశీనగర్‌లో రూ.76.80 లక్షలతో అంగన్‌వాడీ, సామాజిక భవనాలు నిర్మించనున్నారు. ఈమేరకు వీటికి శనివారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోందన్నారు. త్వరలోనే భవన నిర్మాణ పనులు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు ఆయన సూచించారు.

కార్యక్రమంలో పార్టీ 50వ వార్డు అధ్యక్షురాలు పి.సునీత, డైరెక్టర్లు నూకరాజు, రాయుడు శ్రీను, ప్రసూనరెడ్డి, ఐ.రవికుమార్, వార్డు నాయకులు భగాతి విజయ్, ,కృష్ణారావు మాస్టర్ ,ఎం.లక్ష్మి, పాతపట్నం రామ్మోహన్, నారాయణ స్వామి, పొన్నాడ అప్పారావు, మాస్టర్ ఎం.వి.రెడ్డి, సోనీ, చిరంజీవి, త్రినాథ్, నారాయణరావు, రాంబాబు, పూజారి రాము, సీపాన రాము, శివాజీ, జగదీష్, సీనియర్ నాయకులు షేక్ బాబ్జి, కె.చిన్నా, రాఘవులు, గురువోజీ, మాసిన లక్ష్మి, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికి సేవ చేయండి



చైతన్య సదస్సులో పాల్గొన్న పాలిటెక్నిక్ విద్యార్థులు



మాట్లాడుతున్న రిటైర్డ్ వైస్ అడ్మిరల్ రమన్ పూరి

మురళీనగర్: దేశం కోసం మనం ఏమి చేయగలమని విద్యార్థులు ఆలోచించాలని రిటైర్డ్ వైస్ అడ్మిరల్ రమన్ పూరి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ జీవీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు నిర్వహించిన చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే దేశంపై ప్రేమ, త్యాగం అనే ముఖ్యమైన గుణాలను అలవరచుకోవాలని సూచించారు. ప్రపంచంలోనే భారతీయులు అత్యంత మేధోశక్తి గల వారన్నారు. ఎవరి శక్తిపై వారికి సంపూర్ణమైన నమ్మకం కలిగి ఉన్నప్పుడు అనుకున్నది సాధించగలరని చెప్పారు. విద్యార్థులు మంచి విలువలు, ఉన్నత వ్యక్తిత్వం కలిగిన పౌరులుగా తయారు కావాలని, అందుకు అధ్యాపకులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మనిర్భర్ భారత్‌లో పాల్గొని దేశానికి సేవ చేయాలని రమన్ పూరి పిలుపునిచ్చారు. ఇన్నోవేషన్ క్లబ్‌ల ఏర్పాటు ద్వారా పరిశోధనలపై విద్యార్థులకు ఆసక్తి కలిగేలా చూడాలన్నారు. తెలివైన, మేధావులైన విద్యార్థులు ఇతర దేశాలకు వలస వెళ్లడం వల్ల దేశానికి నష్టం కలుగుతుందని వివరించారు. స్వదేశీ సాంకేతిక అభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు విశిష్టమైనవని పేర్కొన్నారు. విద్యార్థులు ఉత్తమ జీవనానికి నిర్ణయాలు తీసుకోవడంలో చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో 800 మంది విద్యార్థులు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 73 కేసుల నమోదు

గోపాలపట్నం: ఫ్యాన్సీ నంబర్లపై రవాణా శాఖ అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 73 కేసులు నమోదు చేశారు. ఒక వాహనాన్ని సీజ్ చేశారు. ప్రత్యేక బృందాలు బోయపాలెం, ఎన్ఏస్‌టీఎల్, మద్దిలపాలెం, గాజువాక, ప్రాంతాల్లో తనిఖీలు చేశాయి. నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలు కొనసాగుతాయని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు.